విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

మంగళవారం 16 సెప్టెంబరు 2025 8 పేజీలు

అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

జాయింట్ కలెక్టర్. ఆర్.గోపాల కృష్ణ

విశాలాంధ్ర-ఒంగోలు : "మీ కోసం"లో వచ్చే ఆర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్. ఆర్.గోపాల కృష్ణ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీ కోసం" కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వీటిని ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వాటికి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని అధికారులకు చెప్పారు. వచ్చిన ఆర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితిల్లోనూ అర్జీలు పెండింగ్ ఉండరాదని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్ లైన్‌లో వచ్చిన వినతులను చూడాలని, అలాగే వచ్చిన అర్జీలకు సరైన పరిష్కారం చూపుతూ రీఓపెన్ కేసులు రాకుండా చూడాలని ఆయన దిశా నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ బి.చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటి కలెక్టరు కుమార్, జాన్సన్, శ్రీధర్ రెడ్డి, మాధురి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన జేసీఐ ఒంగోలు వారోత్సవాలు
2 లో
విశాఖలో ఫార్మారంగ స్టేక్ హోల్డర్స్ సమావేశం

మతసామరస్యం ఇదేనా కలెక్టర్, ఎస్పీ సారూ?

- హిందు దేవాలయాలుగా మారిని కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం
- కలెక్టర్ ఎస్పీ బాధ్యతల రోజు వేదమంత్రోచ్ఛరణలతో మారుమోగిన కార్యాలయాలు
- మతాలను దెబ్బతీసే విధంగా కలెక్టర్, ఎస్పీ విధానం అంటూ విమర్శలు
- ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఇది తగునా అంటూ ప్రశ్నిస్తున్న జిల్లా ప్రజలు
- జిల్లాలో ఏం న్యాయం జరుగుతుందని ప్రశ్నిస్తున్న జనం
- మతాలను సమానంగా చూడాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగకొండ, బీఎస్పీ నేత రాజారావు

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా మతసామరస్యాన్ని కించపరిచే విధంగా వ్యవహరించరాదని ప్రస్తుత బాపట్ల కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అనంతపురం జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నప్పుడు గత నెల అగష్టు నెలలో అక్కడి జిల్లా ప్రజలకు ఇచ్చిన సందేశం. కానీ బాపట్ల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టే సమయంలో కేవలం హిందు సంప్రదాయబద్దంగా పూజలు చేయించి వేదమంత్రోచ్చరణ మద్య కలెక్టర్ బాధ్యతలు చేపట్టం ఏమిటనీ సీపీఐ జిల్లా కార్యదరి తన్నీరు సింగరకొండ ప్రశ్నించారు. బాపట్ల జిల్లా ఎస్పీ బాధ్యతలు చేపట్టిన ఉమామహేశ్వరను సైతం కేవలం హిందు సాంప్రదాయబద్దంగా బాధ్యతలు చేపట్టారన్నారు. జిల్లా ప్రధమ పౌరుడైన కలెక్టర్ జిల్లాలో అన్న వర్గాలు ప్రజలకు సమానంగా ఎలా పాలన సాగిస్తారని... అదేవిధంగా జిల్లాలో శాంతిభద్రతలు కాపడటంతో ప్రజల ధన మాన ప్రాణ రక్షణలో కీలకంగా వ్యవహరించాల్సిన జిల్లా ఎస్పీ మిగతా 2 లో ...

జ్వరాలతో అప్రమత్తం

జిల్లా మలేరియా అధికారి మధుసూదన్‌రావు

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : నల్లమల ప్రాంతాల్లోని గిరిజన గూడాలలో జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లామలేరియా అధికారి నారెడ్ల మధుసూదనరావు తెలిపారు. సోమవారం మండలంలోని గిరిజన గూడలలో జిల్లా మలేరియా అధికారి నాదెండ్ల మధుసూదన్ రావు,చింతల వైద్యధికారి డాక్టర్ యాగ్నిక్, ఆసుపత్రి యొక్క ఒపీ వివరాలు, రక్త పరీక్ష టెస్టులు పరి శీలించి జ్వరాల వివరాలు తెలుసుకొని ల్యాబ్ కు వచ్చే జ్వరాలు, గురించి అడిగి తెలుసుకున్నారు. పాజిటివ్, మరియు ఆక్టివ్, ఏ.ఎన్.ఎం ల ద్వారా ఆర్డిటి కిట్ ద్వారా నమోదు అయిన వివరాలు ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులును అడిగి తెలుసుకొని, అనుమానితుల రక్త పూతలు, బిఎస్ రక్తపుతాలు ద్వారా నిర్దారించాలని, ల్యాబ్‌లో పరీక్షలకు తగినంత ద్రావకం ఉండాలని కోరారు. హాస్టల్‌ను సందర్శించి, పిల్లలు తినే ఆహారపదార్దాలను పరిశీలించి, వంటగధులు పరిశుభ్రంగా ఉంచాలని, బాత్రూమ్‌లను పరిశీలించి, తరగదిలో 4వ తరగతి పిల్లలతో రైమ్స్ పలికించి దోమల ద్వారా వచ్చే వ్యాధులగురించి అవగాహనా కల్పించారు. చిన్నారుట్ల చెంచుగూడెంలో జ్వరాలు వివరాలు సేకరించి, అనుమానితుల రక్తపూతలు సేకరించి పరీక్షలు నిర్వహించి వెంటనే రిజల్ట్ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో, హబీబ్ ఖాన్, దోర్నాల సబ్ యూనిట్ అధికారి కే.ఇజ్రాయెల్, వెంకటేశ్వరరెడ్డి, పంచాయితీ సెక్రటరీ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా 'మోక్షగుండం' జయంతి

విశాలాంధ్ర-మార్కాపురం : అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు సోమవారం వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కాలేజీల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏవన్‌గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్‌ఆలీబేగ్ మోక్షగుండం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోక్షగుండం లాంటి గొప్ప వ్యక్తి మనదేశంలో ముఖ్యంగా మన పశ్చిమ ప్రకాశంలో వారి పూర్వీకులు నివసించడం మన అదృష్టంగా భావించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మీర్జా మహ్మద్ మసూద్‌ఆలీబేగ్, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీధర్, బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌కె మహ్మద్ రఫిలు పాల్గొన్నారు. అలాగే మిగతా 2 లో ...

గ్రామాల్లో మౌలిక వసతులకు సహకరించాలి

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-కొమరోలు : గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు.. కొమరోలు ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని రెవిన్యూ, పంచాయతీ, వైద్య, అటవీ, శిశు సంక్షేమం, విద్యుత్ శాఖ, మండల అభివృద్ధి శాఖలతో సమీక్ష నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి గ్రామ పంచాయతీల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందని, గ్రామాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకారం అందించాల్సిందేనన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం చేయటంలో అలసత్వం తగదని, ప్రజలకు సేవ చేయటం అధికారుల బాధ్యత అన్నారు. అన్నీ వర్గాల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నారావు, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, సొసైటీ బ్యాంక్ చైర్మన్ ముత్తుముల సంజీవ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర – బాపట్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పాల్గొని స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. పట్టణంలోని 11వ వార్డులో ప్రజలకు నూతనంగా ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఆర్‌డిఓ గ్లోరియా, తహసీల్దార్ సలీమా, పట్టణ మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి,వార్డు ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, యూనిట్ ఇంచార్జ్ సూరగాని శేఖర్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే ఆందోళనలు తప్పవు

– ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-మార్కాపురం : మార్కాపురంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో శుక్రవారం రోజు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని విద్యార్థులు ఆందోళన చేయడం జరిగినది. ఈ విషయం తెలుసుకున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం కాలేజీ వద్దకు చేరుకొని కాలేజీ యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థుల దగ్గర అధిక ఫీజులు వసూలు చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేయడం జరుగుతుందని తెలిపారు. యూనివర్సిటీ ఎంత ఫీజు తెలియజేసిందో అంతే ఫీజు విద్యార్థుల దగ్గర తీసుకోవాలని కాలేజీ యాజమాన్యానికి తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు సిహెచ్ పవన్ కళ్యాణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు కనిగిరి నియోజకవర్గ కార్యదర్శి షేక్ తాహిద్, కనిగిరి మండల కార్యదర్శి సయ్యద్ ఇర్ఫాన్, సిపిఐ మార్కాపురం నాయకులు ఖాసిం,తదితరులు పాల్గొనడం జరిగినది.

ఘనంగా మోక్షగుండంలో ఇంజినీర్స్ డే

విశాలాంధ్ర – బేస్తవారిపేట : ప్రముఖ ఇంజినీరింగ్ నిపుణులు, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని మండలంలోని మోక్ష గుండం గ్రామంలో సోమ వారం ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్బారెడ్డి, ఏఈ సుబ్బారావు, బేస్తవారిపేట ఏఈ బి.శ్రీనివాస నాయక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

మహిళలకు చీరలు, ప్లేట్లు పంపిణీ

విశాలాంధ్ర-ముండ్లమూరు : 30 మంది ఎస్టీ పేద మహిళలకు, పురుషులకు యర్రెద్ల సుబ్బారెడ్డి సుబ్బమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ముండ్ల మూరులోని ఎస్టీ కాలనీలో 30 మంది పేద మహిళలకు ప్లేట్లు చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ యర్రెద్ల అనంతా రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మండలంలోని పేదలకు 1000 మందికి ప్లేట్లు దుప్పట్లు చీరలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మా ట్రస్టు ద్వారా పేదలకు చేయూతనందించి వారి అభివృద్ధికి దోహదపడుతున్నామన్నారు.

ఘనంగా మోక్షగుండం జయంతి

(మొదటిపేజీ తరువాయి)

కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పాలెం అనిల్‌కుమార్ మరియు సిబ్బంది మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రాజబాబు, డీన్‌లు ఎం మస్తానయ్య, ఈశ్వరయ్యలు మోక్షగుండం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వీహెచ్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆ కళాశాల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన జాతికి చేసిన సేవలను కొనియాడారు.

విశాఖలో ఫార్మా రంగ స్టేక్‌హోల్డర్స్ సమావేశం

విశాలాంధ్ర-మార్కాపురం : ఫార్మా రంగ అభివృద్ధి, భవిష్యత్ అవకాశాలపై ఆదివారం సాయంత్రం హోటల్ దేవి గ్రాండ్ ఇన్‌లో జరిగిన స్టేక్‌హోల్డర్స్ సమావేశానికి కేంద్ర మంత్రి జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. ఈ సమావేశంలో ఫార్మా పరిశ్రమల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విస్తృత చర్చలు జరిపారు. ఈ కార్యక్రమానికి ఎస్ ఆర్ సి లాబొరేటరీస్ మేనేజింగ్ డైరెక్టర్, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కూడా పాల్గొని మంత్రికి పలు అంశాలపై విన్నవించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను ఫార్మా రంగంలో జాతీయ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కేంద్రం నుంచి మరింత సహకారం అవసరమని కోరారు. పరిశ్రమల విస్తరణతోపాటు మెడికల్ డివైసెస్ తయారీని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ప్రస్తుతం దేశంలో మెడికల్ డివైసెస్ మార్కెట్ సుమారు 12 బిలియన్ డాలర్ల విలువ కలిగి ఉండగా, 2030 నాటికి అది 50 బిలియన్ డాలర్లకు పైగా పెరుగుతుందని అంచనా వేయబడిందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ, అనకాపల్లి, కాకినాడ ప్రాంతాలు మెడికల్ డివైసెస్ తయారీకి అనువైన క్లస్టర్లుగా అభివృద్ధి చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. దీని వలన వేలాది కొత్త ఉద్యోగాలు రావడంతో పాటు దేశీయ ఉత్పత్తి పెరుగుదల మరోవైపు ఎగుమతుల వృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఫార్మా వ్యర్థాలను శుద్ధి చేసే కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ బలోపేతం చేసి, పర్యావరణ అనుకూల ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆరోగ్యరంగం ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలను చేరుకుంటోందని అన్నారు. ఔషధాల తయారీలో భారత్ ప్రపంచానికి 'ఫార్మసీ ఆఫ్ ది వరల్డ్'గా నిలిచిందని, ఇప్పుడు అదే స్థాయి విజయాన్ని మెడికల్ డివైసెస్ రంగంలో సాధించాల్సిన సమయం వచ్చిందని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర భారీ పరిశ్రమల మంత్రి టీజీ భరత్, అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడు సీఎం. రమేష్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చెంచు గిరిజనుల అభివృద్ధిలో అసిస్ట్ సంస్థ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర-పుల్లలచెరువు : గారపెంట చెంచు గూడెంలో చెంచు గిరిజనుల అభివృద్ధి కోసం అసిస్ట్ సంస్థ సిబ్బంది చేపట్టిన కార్యక్రమాలు అభినందనీయమని స్థానికులు ప్రశంసించారు. గత మూడు రోజులుగా అసిస్ట్ సంస్థ-ఐటీడీఏ శ్రీశైలం ఆధ్వర్యంలో, జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు ఆదేశాలు, ప్రాజెక్టు ఆఫీసర్ కె.వెంకట శివప్రసాద్ సూచనల మేరకు ఉచిత మొబైల్ ఆధార్ క్యాంపు నిర్వహించారు.ఈ క్యాంపులో ఇప్పటివరకు 30 కొత్త ఆధార్ కార్డులు, 45 ఆధార్ అప్డేట్ సేవలు అందించగా, చెంచు గూడెంలో జీరో ఆధార్ లేని స్థితి సాధించడమే లక్ష్యంగా అసిస్ట్ సిబ్బంది కృషి చేస్తున్నారు. సోమవారం గారపెంట ఆశ్రమ పాఠశాలలో చెంచు గిరిజనుల అభివృద్ధిపై ట్రైనింగ్ క్యాంపు నిర్వహించారు.ఈ సందర్భంగా పియయు,ఏపిఏవో మధుసూదనరావు మాట్లాడుతూ పుట్టిన తేదీ సర్టిఫికెట్లు, డొమైసిల్ సర్టిఫికెట్లు అసిస్ట్ సంస్థ ద్వారా సిద్ధం చేసి ఆధార్ లేని వారికి కొత్త ఎన్రోల్మెంట్ చేస్తున్నామని తెలిపారు. అలాగే రేషన్ కార్డులు, ఓటర్ ఐడీలు, ఆదాయం, కుల ధృవపత్రాలు, బ్యాంక్ ఖాతాలు, అన్నదాత సుఖీభవ వంటి పథకాల లబ్ది చెంచు గిరిజనులకు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఆధార్ కార్డుల లామినేషన్ కూడా ఉచితంగా అందజేస్తామని తెలిపారు. అసిస్ట్ ఏరియా కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ చెంచు గిరిజన గూడెల్లో బోర్ వెల్ మరమ్మతులు, తాగునీటి సౌకర్యాలు, ఉచిత మొక్కల పంపిణీ చేస్తామన్నారు.

ముగిసిన జేసిఐ ఒంగోలు వారోత్సవాలు

విశాలాంధ్ర-ఒంగోలు : ఈనెల 15వ తారీఖున కాపు కళ్యాణమండపంలో జేసిఐ ఒంగోలు వారి ఆధ్వర్యంలో ప్రారంభమైన జెసి వారోత్సవాలు సోమవారం తో ఘనంగా ముగిశాయి. ఏర్పాటుచేసిన ముగింపు కార్యక్రమం లో జె సి ఐ ఇంటర్నేషనల్ కమిషన్ చైర్మన్ జెసి ఎన్. బి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ జేసి వారోత్సవాల నిర్వహణలో దేశంలోనే జేసిఐ ఒంగోలు ఘనమైన కీర్తిని కలిగి ఉందని, ఏ కార్యక్రమం చేయాలన్నా జేసిఐ ఒంగోలుదే అగ్రస్థానం అని తెలిపారు. జేసిఐ వారోత్సవాలలో సుమారుగా 70 పాఠశాలల నుంచి 5000 మంది విద్యార్థులు రకరకాల పోటీలలో పాల్గొన్నారు అని జేసిఐ ఒంగోలు అధ్యక్షుడు జేసి మేడిశెట్టి వెంకట సుబ్బారావు తెలిపారు. జేసీ వారోత్సవాల చైర్మన్ జెసి శివకోటి రెడ్డి మాట్లాడుతూ వారోత్సవాలు నిర్వహణలో సహకరించిన ప్రతి పాఠశాల కరస్పాండెంట్‌కు తన ధన్యవాదాలు తెలియజేశారు. అంతేకాకుండా వారోత్సవాలు ఎంతో విజయవంతం చేసినందుకు జేసి వారోత్సవాల కో- చైర్మన్లు జెసి గంధ వల్ల బాలకృష్ణ , జేసి శబరి నాద్ నాయర్ మరియు సెక్రెటరీ జెసి శ్రీనివాసరావు, జెసిఅనిల్ కుమార్, ట్రెజరర్ జేసీ బాలసుబ్రమణ్యం గారికి మరియు జెసి వీక్ కోఆర్డినేటర్‌లు జెసి సోమినేని సురేష్, జేసి ఆత్మకూరు బ్రహ్మయ్య జెసి ఆంధ్ర శ్రీనివాసరావు, జెసి కనిబిని నాగేశ్వరరావు, జెసి డాక్టర్ జి.రవికుమార్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రధానం చేసిన కమలపత్ర అవార్డు జేసి సూరే ఏడుకొండలు గారికి, అవుట్ స్టాండింగ్ యంగ్ పర్సన్ అవార్డు డాక్టర్ అంజనీ ప్రియదర్శిని గారికి ఉత్తమ బిజినెస్‌మెన్ అవార్డు కామేపల్లి సీతారామయ్యకి అలాగే సూపర్ కిడ్ అవార్డు చిరంజీవి గంధ వల్ల రాధా రమణకి అందజేశారు.

కలెక్టర్, ఎస్పీ సారూ?

(మొదటిపేజీ తరువాయి)

కేవలం ఒక మత ఆచారాలను బహిరంగంగా పాటించటం జిల్లా ప్రజలకు ఏం సంకేతాలను ఇస్తున్నారని సింగరకొండ ప్రశ్నించారు.

– అన్నీ మతాల పట్ల గౌరవం అందరి సంక్షేమం కోసం పనిచేయటం కలెక్టర్ ముఖ్య బాధ్యత.కలెక్టర్ ప్రభుత్వ పాలనకు సంబంధించిన విధి విధానాలు అనుసరిస్తూ జిల్లా అభివృద్ధి సంక్షేమానికి కృషి చేయటం ప్రధాన కర్తవ్యం. జిల్లాలో ప్రభుత్వ విధానాలను సమర్ధవంతంగా అమలు చేయటం పరిపాలన పర్యవేక్షించటం కలెక్టర్ ముఖ్య విధి. కుల మత వర్గాలకు అతీతంగా జిల్లాలో అన్నీ వర్గాల ప్రజలకు సమానంగా న్యాయంగా జరిగేలా సంక్షేమం అందించేలా చూడాల్సిన బాధ్యత కలెక్టర్‌పై ఉంది. మతాలకు అతీతంగా వ్యవహరించటం కలెక్టర్ ప్రధాన కర్తవ్యం. కేవలం హిందు మతం మాత్రమే కాకుండా అన్నీ మతాల పట్ల గౌరవం కలిగి మతసామరస్యాన్ని కాపాడటం కలెక్టర్ బాధ్యత. జిల్లాలోని అన్నీ వర్గాల ప్రజల సంక్షేమం కోసం వారి అభివృద్ధి కోసం కలెక్టర్ కృషి చేయాలి. కానీ బాపట్ల కలెక్టర్ కేవలం హిందు సాంప్రదాయ బద్దంగా వేదమంత్రోచ్ఛరణలతో కలెక్టరేట్ ప్రాంగణంలో మంత్రాల మధ్య బాధ్యతలు చేపట్టడం ఇతర మత పెద్దలు ఎవరూ లేకపోవటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో హిందువులకు మాత్రమే తాను కలెక్టర్ అని ప్రతిభింబించేలా బాధ్యతలు చేపట్టారని చర్చ జరుగుతుంది.

– జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఉమామహేశ్వర్ సైతం కేవలం హిందు సాంప్రాయదాయబద్దంగా బాధ్యతలు చేపట్టారు. వేదమంత్రోచ్ఛరణలతో ఎస్పీ కార్యాలయంలో హిందు దేవుళ్లకు టెంకాయలు కొట్టి పూజలు చేసి దేవాలయంగా మార్చివేశారని విమర్శలు వెల్లువెత్తున్నాయి. జిల్లాలో ఇతర మతాలకు చెందిన వ్యక్తులు ఈ ఎస్పీ న్యాయం ఎలా చేస్తారనే ప్రశ్న వ్యక్తమవుతుంది. కేవలం హిందువులకు నేను ఎస్పీని అనే విధంగా బాధ్యతలు చేపట్టిన విధానం స్పష్టమైందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

– బాపట్ల జిల్లాలో అన్నీ మతాల ప్రజలు అన్నీ కులాల ప్రజలు కలిసి ఉంటున్నారని కేవలం ఒకే మతాన్ని ప్రతిభింబించేలా జిల్లా కలెక్టర్ ఎస్పీ విధానం ఉండరాదని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండతో పాటు బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుదే రాజారావు సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నప్పుడు కుల మతాలు ఇంటి వరకే పరిమితం చేసి భారత రాజ్యాంగా ప్రకారం అందరికి ఒకే విధంగా పాలన అందించాలని పలువురు ప్రముఖులు సూచిస్తున్నారు.

ప్రతి మహిళను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అక్షర ఆంధ్రతో ప్రతి మహిళను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని వెలుగు ఏపీఎం ఎం హనుమంతరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం స్వయం సహాయక సంఘాల మహిళలకు అక్షర ఆంధ్రపై శిక్షణ నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ మండలంలో 4000 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు 410 మంది వాలంటీర్లను స్వచ్ఛందంగా ఎంపిక చేసామన్నారు. వాలంటీర్లు స్వచ్ఛందంగా అక్షరాభ్యాసం చేసేందుకుముందుకు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యా పర్యవేక్షకులు చౌడిరెడ్డి, సీసీ రత్నకుమారి, అకౌంటెంట్ జై మార్తమ్మ, సంఘాల మహిళలు పాల్గొన్నారు.

కరాటే పోటీలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు

విశాలాంధ్ర - గిద్దలూరు : జాతీయస్థాయిలో జరిగిన కరాటే పోటీల్లో గిద్దలూరు విద్యార్థినీ విద్యార్థులు 20 గోల్డ్ మెడల్స్ సాధించారని కరాటే మాస్టర్ పాణ్యం సుబ్రహ్మణ్యం తెలిపారు. గిద్దలూరులో శిక్షణ తీసుకుంటున్న పలు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు కర్నూలులో జరిగిన పోటీల్లో అద్భుతంగా రాణించారని అందులో బాలికలు ఎక్కడ ఆత్మ ఉన్నత భావాన్ని వ్యక్తం చేయకుండా గోల్డ్ మెడల్ సాధించడం విశేషం అన్నారు. మొత్తం 20 గోల్డ్ మెడల్స్ సాధించగా వారి తల్లిదండ్రులు సోమవారం పాణ్యం సుబ్రహ్మణ్యం ఘనంగా సన్మానించారు.

అనంతరం కరాటే మాస్టర్ పాణ్యం వెంకట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తన విద్యార్థులందరూ పథకాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉందని, ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లలకు ఆత్మ రక్షణ విద్యలు నేర్పించాలని ఆయన కోరారు. ఆడపిల్లలు కరాటే లాంటి ఆత్మ రక్షణ విద్యలు నేర్చుకోవడం వల్ల వాళ్ళలో ఆత్మస్థైర్యం పెంపొందు తుందని, సమాజంలో ఆడపిల్లను అనే భావానికి లోను కాకుండా ఎక్కడైనా ధైర్యంగా ఉండగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ చాంద్పాషా షాషావలి, తిరుమల డిపో షబ్బీర్ తో పాటు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్విస్ కళాశాలలో ఘనంగా ఇంజనీర్స్ డే

- ఐడియా థాన్ నిర్వహించిన యాజమాన్యం
- సరికొత్త ఆవిష్కరణలతో ముందుకు వచ్చిన విద్యార్థులు

విశాలాంధ్ర -ఒంగోలు : భరతజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఇంజనీర్.. ప్రపంచ ప్రసిద్ధి కట్టడాల రూపశిల్పి.. అద్భుత ఆనకట్టలు, వంతెనలు, రహదారుల నిర్మాత.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డైకిన్ ఎయిర్ కండీషనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ జోషి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంజనీర్స్ డే సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. పలు కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. దాంట్లో భాగంగా నిర్వహించిన ఐడియాథాన్‌కి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. దాదాపు 60 సరికొత్త ఐడియాలు, ప్రాజెక్టులతో విద్యార్థులు ఐడియాథాన్‌లో పోటీపడ్డారు. విద్యార్థుల ఐడియాలను పరిశీలించిన ఒంగోలుకు చెందిన జాజి టెక్నాలజీస్ కంపెనీ ప్రతినిథులు విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు, ప్రోటోటైప్‌లను పరిశీలించి వారికి బహుమతులు అందజేశారు. ఈ ఐడియా థాన్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్విస్ విజార్డ్స్ తేజస్విని టీమ్ కి మొదటి బహుమతి, బీ సాల్వ్స్ పి.మహీంద్ర టీమ్ కి రెండో బహుమతి, సైబర్ షీల్డ్ ఎస్ కె. ఇమ్రాన్ టీమ్ కి మూడో బహుమతి అందజేశారు. ఈ ఐడియాథాన్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని స్మార్ట్ ఇండియా హ్యాక్ థాన్‌కి పంపించనున్నట్లు డీపీఎస్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు తెలియజేశారు. క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ప్రాజెక్ట్ లకు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, దాని ద్వారా విద్యార్థులకు నైపుణ్యాలు మెరుగుపడతాయని విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి గాయత్రి అన్నారు. ఈ సందర్భంగా అందరికీ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, డీన్ లు, డైరెక్టర్లు, హెచ్ వోడీలు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సీఎస్ సీడీఈ డీన్ డాక్టర్ భార్గవ్ అండ్ టీమ్ పర్యవేక్షించారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామీణ ప్రాంతాల్లోని పేద మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వరల్డ్ బ్యాంకు ఆయుష్మాన్ బృందం డాక్టర్లు ఎం చరిత, ఎం భార్గవి అన్నారు. మండలంలోని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల శంకరాపురం గ్రామంలో సోమవారం ఆయుష్మాన్ ఆరోగ్యం వరల్డ్ బ్యాంకు కన్సల్టెంట్లు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వివిధ కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామంలో ఆరోగ్య సేవలు ఎలా ఉన్నాయి అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజలకు ఆయుష్మాన్ ఆరోగ్యం ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న వైద్య సేవలు సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ అధికారిని శశి కోడూరి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్ సి హెచ్ ప్రోగ్రాం అధికారిని డి సుబ్బులక్ష్మి, మారెళ్ళ వైద్యాధికారి సిహెచ్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ ఎన్ వర్మా, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ కోలాహలం అప్పలరాజు, సూపర్వైజర్ ఏ అంజమ్మ, ఏఎన్ఎం జె మీనాక్షి, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

పందిటి మోహన్

విశాలాంధ్ర - కనిగిరి : అర్హులైన పేదలందరికీ ఇంటి నివేశన స్థలాలను ఇవ్వాలని సీపీఐ కనిగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి పందిటి మోహన్ అన్నారు. అర్హులైన పేదలకి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కనిగిరి ఎమ్మార్వో రవిశంకర్‌కి సోమవారం ఎమ్మార్వో కార్యాలయం నందు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నాయి ప్రజా ప్రతినిధులు మారుతున్నారు. పేదలకి ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయి అన్నారు. పేదలకి ఇళ్ల స్థలాలు, సొంత ఇల్లు లేక అద్దె కట్టలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సీపీఐ కనిగిరి మండల సహాయ కార్యదర్శి గులాం హుస్సేన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం లక్షలాదిమందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ అర్హులైన పేదలకి ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం మేము అధికారంలోకి వస్తే పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలాలు అర్హులైన పేదలందరికీ ఇస్తామని చెప్పినప్పటికీ అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తి అయిన నేటికీ ఏ ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. వెంటనే అర్హులకు ఇంటి నివేశన స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలను కేటాయించాలన్నారు. ఎమ్మార్వో సానుకూలంగా స్పందిస్తూ అర్హులని గుర్తించి త్వరలోనే ఇళ్ల స్థలాలని ఇస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఖాసిం పీరా, రైతు సంఘం గుజ్జుల బాలి రెడ్డి, మహిళా సమాఖ్య నాయకురాలు బషీరా, రంజాబేగం హబీబా నల్లబోతుల పిచ్చమ్మ రిహానా సల్మా హజరత్ బి హబీబా పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

సిఐ ఎం.భీమా నాయక్

విశాలాంధ్ర-పామూరు : ఉన్నత చదువులతో పాటు ఉన్నత విలువలను కలిగినప్పుడే సమాజంలో యువత గౌరవింపబడుతుందని సిఐ ఎం.బీమా నాయక్ అన్నారు. సోమవారం శ్రీ వెంగమాంబ జూనియర్ కళాశాల, ఈటీఎన్ అండ్ ఎల్ డిగ్రీ కళాశాలల విద్యార్థులు ప్రసర్ధ డే వేడుకలు ను స్థానిక అనిల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐ ఎం. భీమా నాయక్ మాట్లాడుతూ కొంతమంది విద్యార్థులు మత్తు కు అలవాటు పడి తమ జీవితాలను సర్వనాశనం చేర్చుకుంటున్నారని తెలిపారు. అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుపై దృష్టి సారించి బద్ధంగా చదివి ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలన్నారు. నిర్వ హించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధాన చేశారు.

సదరం రివెరిఫికేషన్‌లో దివ్యాంగులకు అన్యాయం

దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ధూళిపాళ్ల మల్లికార్జునరావు

విశాలాంధ్ర - కనిగిరి : సదరం రివెరిఫికేషన్ ప్రక్రియలో అర్హులైన దివ్యాంగులకు జరుగుతున్న అన్యాయాలను నివారించాలని కోరుతూ, దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ధూళిపాళ్ల మల్లికార్జునరావు ఆధ్వర్యంలో దివ్యాంగులు కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డిని సోమవారం కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాలలో సుమారు పది లక్షల మంది పోలియో వ్యాధితో బాధపడుతూ జీవితాన్ని గడుపుతున్నారని, కానీ ప్రభుత్వం 7.38 లక్షల మందికి మాత్రమే పెన్షన్లు అందిస్తుందని తెలిపారు. వీరికి సదరం సర్టిఫికెట్ల తోపాటు పెన్షన్ అందించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, రివెరిఫికేషన్ ప్రక్రియలో తీవ్ర అన్యాయాలు చోటు చేసుకున్నాయని ఉన్న పెన్షన్లను తొలగించడం పై వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైకల్యాన్ని బట్టి ఇచ్చిన సదరం సర్టిఫికెట్లలో పర్సంటేజ్లు మార్పులు చేయడం వల్ల, 90 శాతం వైకల్యం ఉన్నవారికి 50, 60, 75 శాతం మాత్రమే ఇచ్చారని. 50,60 శాతం పర్సంటేజ్ ఉన్న సర్టిఫికెట్లను పూర్తిగా తొలగించారని వారు తెలిపారు. పుట్టుకతో వచ్చిన దివ్యాంగత్వంలో మార్పు రాలేదు కానీ సదరం రివెరిఫికేషన్ ప్రక్రియలో పర్సంటేజ్లో మార్పు ఎలా వచ్చింది. జీవితాంతం వైకల్యం ఉన్నవారికి పర్సంటేజ్లో మార్పులు రావడం సరికాదని ఇది ఉన్నతాధికారుల కౌన్సిలింగ్ లోపం, వైద్యుల నిర్లక్ష్యం, కమిటీలు ఏర్పాటు చేయకపోవడం వంటి కారణాల వల్ల జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల వేదిక కనిగిరి నియోజకవర్గ కార్యదర్శి వేముల మైనర్ బాబు, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీరామ లక్ష్మి, తదితర దివ్యాంగులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు చేయించాలి

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలోని పసుపోషకులు పశుసంవర్ధక శాఖ వారు అమలు చేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు చేయించాలని పశు వైద్యాధికారి డాక్టర్ జె శివరామకృష్ణ సోమవారం తెలిపారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు తీవ్రమైన జ్వరం, నోటి నుండి తీగల వలె చొంగ పడుతూ నోరు, కాలు గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి పశువులలో పాల ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా తగ్గటంతో పాటు పశువులలో మరణాల సంభవిస్తాయని తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు నెల రోజులపాటు మండలంలోని అన్ని రైతు సేవ కేంద్ర పరిధిలో పశువులకు ఉచితంగా గాలికుంటు టీకాలు చేయటం జరుగుతుందని శివరామకృష్ణ తెలిపారు.

రైతుల ఆత్మహత్యలు మోదీ పాలనలో రెట్టింపు

రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి

విశాలాంధ్ర - బేస్తవారిపేట : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. వీరారెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గిద్దలూరు నియోజకవర్గ సమావేశం అధ్యక్షుడు జే.అంకయ్య అధ్యక్షతన బేస్తవారిపేటలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా వీరారెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల ముందు నరేంద్ర మోడీ డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తామని హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు అయినా నేటికీ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయలేదని విమర్శించారు. ఎర్రకోట, పార్లమెంటు సాక్షిగా మన దేశ రైతులకు అండగా ఉంటామని నరేంద్ర మోడీ హామీ ఇచ్చారని, కానీ ఇటీవల కాలంలో డోనాల్డ్ ట్రంప్ మన దేశం నుండి అమెరికాకు దిగుమతి అయ్యే ఉత్పత్తుల మీద 50 శాతం సుంకం విధిస్తే మన ప్రధానమంత్రి దానిపై నోరు మెదపడు. ఇదేనా అండగా ఉండడం అంటే అని ఆయన ప్రశ్నించారు. మనదేశంలో రొయ్యలు సాగు చేసే రైతాంగం అమెరికా నుంచి యూరప్ కు ప్రధానంగా అమెరికాకే 40 శాతం రొయ్యల దిగుమతి జరుగుతుందని వారి మీద 50 శాతం టారిఫ్ విధించడం ద్వారా రొయ్యల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో రైతు సంఘాలు అనేక ఆందోళనలు చేపట్టిన ఫలితంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిపై చర్యలు తీసుకోవాలని నరేంద్ర మోడీకి లెటర్ రాసినా ప్రధానమంత్రికి చీమకుట్టినట్లైనా లేదని విమర్శించారు. అలాగే ప్రభుత్వ సర్వే ప్రకారం రోజుకు 31 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, కానీ నరేంద్ర మోడీని ప్రశ్నించే స్థితిలో అధికార పార్టీ, ప్రధాన ప్రతిపక్షం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి ధాకాల పుల్లయ్య, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఊరుమార్చు జోషేప్, రైతులు పాల్గొన్నారు.

బీసీ బాలుర వసతి గృహాన్ని జడ్పీటీసీ తనిఖీ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని గొట్లగట్టులో గల బిసి బాలుర వసతి గృహాన్ని మండల జెడ్పిటిసి సభ్యుడు అక్కి దాసరి ఏడుకొండలు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని గదులను వంటశాలను మరుగుదొడ్లను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మెనూ ప్రకారం భోజనం పెట్టాలని వార్డెన్ మహమ్మద్ ఖాసింకు ఆదేశించారు. ప్రైవేట్ భవనంలో ఉన్న వసతి గృహానికి ప్రభుత్వ బిల్డింగు మంజూరు చేయాలని జిల్లా పరిషత్ సమావేశంలో ఉన్నతా అధికారులు దృష్టికి తీసుకు పోతామన్నారు. జడ్పిటిసితో పాటు నాగంపల్లి ఎంపీటీసీ సభ్యుడు కే వెంకటేశ్వర్లు, సలనూతల సర్పంచ్ అంజయ్య రామ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మొక్కల పెంపకంతో వాతావరణ సమతుల్యత

విశాలాంధ్ర -తాళ్లూరు: మొక్కల పెంపకంతో వాతావరణ సమతుల్యత సాధ్యమని టిడిపి జిల్లా లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ అన్నారు. విఠలాపురం గ్రామంలో సోమవారం చంద్రన్న పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్, గురుతుల్యులు అచ్చేం నాయుడు ఆశీస్సులతో చంద్రన్న పచ్చదనం కార్యక్రమాన్ని నిర్విరామంగా నిర్వహిస్తున్నట్లు పరిటాల సురేష్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, కాలనీ వాసులకు, రైతులకు మొక్కలను అందించి పెంచాలని సూచించారు. నవులూరి రామ ఆంజనేయులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన ఎరువులు అందించటమే లక్ష్యం

విశాలాంధ్ర -తాళ్లూరు: రైతులకు నాణ్యమైన ఎరువులు అందించటమే లక్ష్యంగా నిత్యం ఎరువుల దుకాణంలోని బ్యాచ్‌లను పరిశీలిస్తున్నట్లు వ్యవసాయాధికారి ప్రసాద రావు తెలిపారు. తూర్పు గంగవరంలో శ్రీ వెంకటేశ్వర, మన గ్రోమోర్ ఫెర్టిలైజర్స్‌ను సోమవారం అకస్మిక తనిఖీలు నిర్వహించారు. యూరియా , డీఏపీ ఎరువులను తీసి విశాఖ పట్నం రీజనల్ కోడింగ్ సెంటర్‌కు పంపనున్నట్లు తెలిపారు. దుకాణాలలో అవసరమైన అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నవా లేవా చూసుకుని దుకాణాదారులు అన్ని పత్రాలను, స్టాకు వివరాలను నిత్యం సక్రమంగా ఉంచుకోవాలని కోరారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఎమ్మెల్యే ముత్తుముల నివాళులు

విశాలాంధ్ర-కొమరోలు : ఇంజనీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా కొమరోలు మండల సర్వసభ్య సమావేశంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని "జాతీయ ఇంజనీర్స్ డే గా జరుపుకుంటున్న సందర్భంగా నవభారత నిర్మాణం కోసం కృషి చేస్తోన్న ఇంజనీరింగ్ నిపుణులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి నివాళులు అర్పించారు. తెలుగుదేశం ప్రభుత్వానికి పేరు తెచ్చిన ఎన్నో నిర్మాణాలకు తమ ప్రతిభను అందించిన ఇంజనీరింగ్ నిపుణుల ఋణం తీర్చలేనిదని, అమరావతి నిర్మాణంలో కష్టపడుతున్న ఇంజనీర్లకు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ, రాజధాని నిర్మాణం రాష్ట్ర గౌరవం, అభివృద్ధికి ప్రతీక అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొమరోలు ఎంపీపీ కామూరి అమూల్య, ఎంపీడీఓ చెన్నారావు, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, సొసైటీ బ్యాంక్ ఛైర్మన్ ముత్తుముల సంజీవ రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, మరియు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అర్ధవీడు ఎస్సైగా నాంచారయ్య

విశాలాంధ్ర-అర్ధవీడు : అర్ధవీడు ఎస్సైగా ఎం శివ నాంచారయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సుదర్శన్ యాదవ్ బదిలీపై ఒంగోలు వెళ్లారు. గిద్దలూరు లో పనిచేస్తున్న శివ నాంచారయ్యను అర్ధవీడుకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన శివ నాంచారయ్య మాట్లాడుతూ అర్ధవీడు మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలకు కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆర్యవైశ్య జిల్లా కోశాధికారిగా నరసింహారావు

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : ఆర్యవైశ్య జిల్లా కోశాధికారిగా పెద్ద దోర్నాల గ్రామానికి చెందిన రావిక్రింది నరసింహారావు ఆర్యవైశ్య జిల్లా కోశాధికారిగా ఎంపిక కావటం పట్ల దోర్నాల మండల ఆర్యవైశ్యులు ఎంతో అభినందనీయం తెలియజేశారు. ఆదివారం దర్శి పద్మావతి కల్యాణ మండపంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో దోర్నాలకు చెందిన నరసింహారావు జిల్లా కోశాధికారిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన పలువురు అభినందనలు తెలియజేస్తూ, పూలమాలలతో, శాలులతో ఘనంగా సన్మానించారు. అతను మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి తల వంతు సాయి శక్తుల కృషి చేస్తానని తెలిపారు. దోర్నాలలో పలు సేవా కార్యక్రమాలు చేస్తూ తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి నరసింహారావుకు ఆర్యవైశ్య తరుపున జిల్లా కోశాధికారి కావడం పట్ల పలువు రు అభినందనలు తెలియజేస్తున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించుటలో ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిరసనగా ఏపీటీఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లా శాఖ మార్కాపురం జోన్ ఫెడరేషన్ బాధ్యుతో కలిసి ఉపాధ్యాయులు ఆదివారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఏపీటీ ఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి రఘు బాబు, జిల్లా ఉపాధ్యక్షులు బి శేషారావు ,రాష్ట్ర కౌన్సిలర్ కే శ్రీనివాసరావు కట్టా శ్రీను, ఎం రాము కొనకనమిట్ల మండల బాధ్యులు మంచికల పెద్ద కోటేశ్వరరావు, యోగి రాములు మార్కాపురం బాధ్యులు రాఘవ, కిరణ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్ల, పెదారికట్ల గొట్లగట్టు పశువైద్యశాల పరిధిలోని పలు గ్రామాల్లో 770 గేదెలకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు పశువైద్యాధికారులు శ్రీకాంత్ రెడ్డి, వి.రాజ్యలక్ష్మిలు తెలిపారు. సోమవారం ఆయా పశువైద్యశాల పరిధిలోని పలు గ్రామాలలోని గేదెలకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ టీకాలు గేదెలకు వేయడం వల్ల గాలికుంటు వ్యాధి సోకకుండా ఉంటుందని ఈ టీకాల కార్యక్రమం అక్టోబర్ నెల 15వ తేదీ వరకు జరుగుతుందన్నారు. పశు పోషకులు తమ గేదెలకు టీకాలు వేయించుకోవాలని కోరారు.

టైక్వాండోలో కారుమంచి యువత కీర్తి

విశాలాంధ్ర-టంగుటూరు : టైక్వాండో కరాటేలో కారుమంచి గ్రామ యువకులు ఇంచుమించుగా అంతర్జాతీయ స్థాయి పోటీల్లో విజయకేతనం ఎగురవేశారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని సిఎంసి బాలయోగి ఇండోర్ స్టేడియంలో సెప్టెంబర్ 13, 14 తేదీలలో నిర్వహించిన 2005 ఫస్ట్ ఏషియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ టైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీల్లో టంగుటూరు మండలం కారుమంచికి చెందిన మేడికొండ మణికంఠం బంగారు పతకం, గాలి శివరామకృష్ణ రజిత పతకాన్ని సాధించారు. కారుమంచి గ్రామంలో టైక్వాం డో అభ్యాసం గత కొంతకాలంగా బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డాన్ దగ్గుమాటి విజయ్ మార్గదర్శకత్వంలో జరుగుతోంది. ఆయన శిక్షణలోనే పలువురు విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకుంటూ విజయాలు సాధిస్తున్నారు. ఈ సందర్భంగా దగ్గుమాటి విజయ్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే సెల్ఫ్ డిఫెన్స్ విద్యలు నేర్చుకోవడం ద్వారా పిల్లల్లో క్రమశిక్షణ, మానసిక ధైర్యం, శారీరక దృఢత్వం పెంపొందుతాయని వెల్లడించారు. ప్రస్తుత ఆధునిక యుగంలో విద్యతో పాటే శారీరక దారుఢ్యం అవసరమని అన్నారు. విజయకేతనం ఎగురవేసిన మణికంఠం, శివరామకృష్ణలను ప్రత్యేకంగా అభినందిస్తూ వారి భవిష్యత్ విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు.

మండల స్థాయి స్పోర్ట్స్ మీట్‌కి షేక్షావలి రూ.10వేల విరాళం

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : పెద్దదోర్నాల సేఫ్టీ డ్రైవర్ సంఘం అధ్యక్షులు షేక్షావలి దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మండల స్థాయి స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం కోసం పెద్దదోర్నాల ప్రభుత్వ హైస్కూల్‌కు తన వంతు సహకారంగా పదివేల రూపాయల విరాళంను సోమవారం స్థానిక ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా షేక్షావలి మాట్లాడుతూ, హైస్కూల్‌లో నేనే చదివాను. ఇక్కడ గడిపిన రోజులు నాకు జీవితాంతం మధురస్మృతులుగా మిగిలిపోయాయి. ఈ పాఠశాలే నాకెంతో నేర్పింది. అందుకే క్రీడలలో పాల్గొనే విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశ్యంతో ఈ విరాళం ఇచ్చాను" అని తెలిపారు.స్కూల్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొని షేక్షావలి చేసిన సేవా మనసుకు అభినందనలు తెలిపారు.

ఎస్సై మహేంద్రపై డీజీపీకి ఫిర్యాదు

ఫోక్సో కేసు ఫాల్స్ చేయాలనుకోవడం

గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అవగాహన సదస్సుల స్ఫూర్తికి విరుద్ధం

విశాలాంధ్ర -ఒంగోలు : ఐదుగురు విద్యార్థినులను లైంగికంగా వేధించిన ముగ్గురు ఉపాధ్యాయులను రక్షిస్తానని కాంట్రాక్ట్ తీసుకుని, ఫోక్సో కేసును ఫాల్స్ గా రిఫర్ చేయనున్న సింగరాయకొండ ఎస్సై మహేంద్రపై దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డీజీపి హరీష్ కుమార్ గుప్తా కి ఫిర్యాదు చేశారు. సోమవారం ఒంగోలులోని దళిత హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాగేంద్ర మాట్లాడుతూ ఎస్సై బండ్లమూడి మహేంద్ర ధనవంతుల రక్షకుడు అన్నారు. తల్లి దండ్రులు తమ బిడ్డలకు ఇంటి దగ్గర ఉన్నప్పుడు కంటే, స్కూలులో ఉన్నప్పుడే రక్షణ ఉంటుందని భావిస్తా రన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నూటికి 90 మంది ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీల బిడ్డలే చదువుతున్నారన్నారు. క్రైం నెంబర్ 174/25 ఫోక్సో కేసును ఫాల్స్ గా రిఫర్ చేయటంలో కుట్ర ఉందన్నారు. పిల్లి హజరతయ్య సస్పెన్షన్కు కారణమైన ఐదుగురు విద్యార్థినుల స్టేట్మెంట్ వల్ల మరో ఇద్దరు టీచర్లు చిరుమామిళ్ల సుధాకర్, ఉలిచి సుబ్బారెడ్డిలు సస్పెండ్ అయ్యే పరిస్థితి ఉండడంతో, అయిదు గురు విద్యార్థినుల స్టేట్మెంట్లను మార్చేందుకు ఎస్ఐ మహేంద్ర బరితెగించాడ న్నారు. జూలై 29,30తేదీల్లో లైంగిక వేధింపులు జరిగాయని చెప్పిన విద్యార్థినులు, 40 రోజుల తర్వాత మాట మార్చారని చెప్పటం సిగ్గుచేటు అన్నారు. ఫోక్సో కేసు ఫాల్స్ చేయాలనుకోవడం గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ అవగాహన సదస్సుల స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిజికల్ డైరెక్టర్ పిల్లి హజరతయ్యపై నమోదైన ఫోక్సో కేసులో వేసిన సెక్షన్ 12 శిక్షా కాలం 3 సంవత్సరాలు మాత్రమే అని, ఈ కేసులో స్టేషన్ బెయిల్ ఇచ్చే అవకాశం ఉందన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన ముగ్గురు ఉపాధ్యాయులను చట్టం నుంచి తప్పించేందుకు, లైంగిక వేధింపులపై పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసిన డిప్యూటీ ఈఓ చంద్రమౌళీశ్వర్ను ఎస్సై వేధించారన్నారు. ఎస్సై మహేంద్ర, డిప్యూటీ ఈఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తును చేయకుండా, డిఫెన్స్ లాయర్ లాగా నిందితుల తరపున వకాల్తా తీసుకు న్నాడన్నారు. ఎస్ఐ మహేంద్ర కేసు దర్యాప్తులో ప్రాసిక్యూషన్కు ఉపకరించే పలు అంశాలను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేశారన్నారు. కారుమంచి జడ్పీ హైస్కూల్లో దళిత బాలికను లైంగికంగా వేధించిన ఘటనలో దళిత టీచర్ సుధాకర్ ను ఇరికించాలని చూశారని, ఇదే ఎస్ఐ కేసు నిర్ధారణ కాక ముందే సుధాకర్ను తీసుకొచ్చి పోలీస్ స్టేషన్లో కూర్చోబెట్టారన్నారు. క్రైమ్ నెంబర్ 174/25 పోక్సో కేసు విచారణ బాధ్యత నుంచి ఎస్సై మహేంద్రను తప్పించాలని, రిఫర్ ప్రొసీజర్ ను అడ్డుకోవాలని, నాగేంద్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఎస్సై మహేంద్రను ఫోక్సో కేసు విచారణ బాధ్యతల నుంచి తప్పించాలని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోతికలపూడి జయరాం గుంటూరు ఐజి, ప్రకాశం ఎస్పీ, ప్రకాశం కలెక్టర్లకు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు హిమబిందు ఎంపిక

విశాలాంధ్ర - వేటపాలెం : బాపట్ల జిల్లా 51వ జూనియర్ బాలుర,బాలికల కబడ్డీ ఎంపిక పోటీలు ఆదివారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో విజయవంతంగా నిర్వహించారు.ఈ పోటీలలో వేటపాలెం జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని పి.హిమబిందు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమన్నారు.బాపట్ల జిల్లా తరపున రాష్ట్ర స్థాయి జట్టు ఈనెల 22 నుండి 25 వరకు విజయవాడలోని గొల్లపూడిలో జరగబోయే కబడ్డీ పోటీల్లో పాల్గొననుందని బాపట్ల కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి మంతెన సుబ్బరాజు అన్నారు. హిమబిందుకు ఇన్ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఉమ్మిటి వేణు గోపాలరావు,స్టాఫ్ సెక్రటరీ కె.సోమశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు జడ దేవబిక్షం,జరుబుల శ్రావణితో పాటు ఉపాధ్యాయులు,విద్యార్థులు అభినందనలు తెలిపారు.హిమబిందు ప్రతిభపై ఆశాభావం వ్యక్తం చేస్తూ రాష్ట్ర స్థాయిలోనూ విజయాన్ని సొంతం చేసుకోవాలని అందరూ ఆకాంక్షించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

విశాలాంధ్ర - అద్దంకి : పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ ఏడి డాక్టర్ బ్రహ్మయ్య పశుపోషకులకు సూచించారు.సోమవారం మండలంలోని నాగులపాడులో ఆయన పశువులకు గాలికుంటు టీకాలు వేశారు.మూడు సంవత్సరాల పైబడిన లేగ దోడలకు,ఏడు నెలలు లోపు ఉన్న సూడి పశువులకు తప్పనిసరిగా గాలికుంటు టీకాలు వేయించాలన్నారు.ఈనెల 15 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు మండలంలో అన్ని గ్రామాలలో పశువైద్య సిబ్బంది పశువులకు గాలికుంటు టీకాలు వేస్తారన్నారు.అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తంగేడుమల్లిలో యూరియా పంపిణీ

విశాలాంధ్ర - సంతమాగులూరు : తంగేడుమల్లిలోని రైతు సేవా కేంద్రంలో యూరియా అందుబాటులోకి వచ్చిందని సంతమాగులూరు మండల ఏవో షేక్ సైదా తెలిపారు.సోమవారం సర్పంచ్ మర్రిపాటి రంగనాథబాబు అధ్యక్షతన రైతులకు యూరియా పంపిణీ చేశారు. పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులకు రెండు బస్తాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల విషయంలో అన్నదాతలు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. శివయ్య,ఆర్ఎస్కే సిబ్బంది వెంకటేశ్వర్లు,కానిస్టేబుల్ ఏడుకొండలు పాల్గొన్నారు.

తెనాలి బస్సులు ఖాదర్ ఖాన్ సెంటర్ వరకు నడపాలి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : తెనాలి నుండి చెరుకుపల్లి వచ్చే బస్సులు ఐలాండ్ సెంటర్ వరకు కాకుండా ఖాదర్ ఖాన్ సెంటర్ వరకు నడపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.దీని విషయమై సోమవారం తాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా ఓంకార్ సేవా సమితి అధ్యక్షుడు గండే సాంబశివరావు మాట్లాడుతూ తెనాలి బస్సులను ఐలాండ్ సెంటర్లో ఆపడంతో ఖాదర్ ఖాన్ సెంటర్ వరకు వచ్చే ప్రయాణికులు,వృద్ధులు,వికలాంగులు,స్త్రీలు అర కిలోమీటర్ మేర నడవవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో ఇబ్బంది ఉంటుందన్నారు.అంతేకాకుండా రేపల్లె డిపో నుండి గుంటూరు,చీరాల వెళ్లే బస్సులు ఖాదర్ ఖాన్ సెంటర్లో ఆపాలంటే రాంబట్లవారిపాలెం చార్జిని వసూలు చేస్తున్నారు.దీనిపై రేపల్లె డిపో మేనేజర్ స్పందించి చెరుకుపల్లి ప్రయాణికులకు టికెట్టు చెరుకుపల్లి వరకే నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞాపన అందించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు

విశాలాంధ్ర - రేపల్లె : రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం, రేపల్లెలో రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం. రామలక్ష్మి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరిగినది.ఇందులో మొత్తం ఐదు అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు.

దసరా సెలవులను మార్పు చేయాలి

విశాలాంధ్ర - పర్చూరు : దసరా సెలవులను మార్పు చేయాలని హిందీ ఉపాధ్యాయుల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు హనుమంతరావు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం విజయవాడ వారు దసరా ఉత్సవాలను సెప్టెంబర్ 22 నుండి ప్రారంభం అవుతాయని అధికారికంగా ప్రకటించి ఉన్నారన్నారు.ప్రభుత్వం ప్రకటించిన అకాడమిక్ క్యాలెండర్లో దసరా సెలవులు ఈనెల 24 నుండి అక్టోబర్ 2 వరకు సూచించబడినదన్నారు.దీంతో దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంలో పాల్గొనుటకు అవకాశం లేనందున రాష్ట్ర పండుగల్లో ఒకటైన దసరా పర్వదినాన్ని అందరూ జరుపుకొనుటకు 22 నుండి సెలవులను ప్రకటించి అక్టోబర్ 3 వరకు సెలవులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

ఈ-పంట నమోదును వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - రేపల్లె : మండలంలోని రైతులందరూ ఈ పంట నమోదును వేగవంతం చేయాలని రేపల్లె వ్యవసాయ అధికారి మహేష్ రైతులకు విన్నవించారు.సోమవారం మండలంలోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద రైతు సేవ కేంద్ర సహాయకులకు సమీక్ష సమావేశం నిర్వహించారు.మహేష్ మాట్లాడుతూ ఈ పంటతో పాటు ఈకేవైసీని కూడా ఈనెల 30వ తేదీ లోపు ముగించాలని తెలిపారు. అలాగే ప్రతి ఒక్క రైతు,కౌలు రైతు ఈ పంట నమోదులో నమోదెయ్యి లాగా చూడాలని వివరించారు. గ్రామాల రైతు సేవా కేంద్రాల సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్ల దినోత్సవం

విశాలాంధ్ర - చీరాల టౌన్ : చీరాల ఎన్.ఆర్.పి.ఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రౌండ్లో 58వ ఇంజనీర్స్ డే సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ముఖ్య ఆహ్వానితులుగా ఇంజనీర్లు కరణం శ్రీనివాసబాబు, మునిసిపల్ డి.ఈ.రఘురామ్,మునిసిపల్ ఏఈ రవి కుమార్,ఎలక్ట్రికల్ డీఈ పెరుగు శ్రీనివాసరావు,ఎస్.ఎన్ కృష్ణ కాంత్,వలివేటి మురళీకృష్ణని ఘనంగా సత్కరించారు.వక్తలు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య పూణేలో సివిల్ ఇంజనీరింగ్ పట్టభద్రులు, వెంటనే పబ్లిక్ వర్క్స్ డిపార్ట్మెంటులో చేరి ఖడక్వాస్లా జలాశయంలో మొదట ఆటోమేటిక్ వాటర్ ఫ్లడ్ గేట్లని రూపొందించి పేటెంట్ పొందిన వ్యక్తి,కావేరి నదిపై కృష్ణ రాజసాగర్ ఆనకట్ట 120 అడుగుల ఎత్తులో సున్నంతో నిర్మించి ఒక లక్ష యిరవై వేల ఎకరాలకు సాగు నీరందించారన్నారు.బృందావన గార్డెన్ని అభివృద్ధి చేసి,నిజాం నవాబు పిలుపు మేరకు హైదరాబాద్ నగరాన్ని వరదల నుండి రక్షించి,విశాఖపట్నం రేవును సముద్రపు కోత నుండి రక్షించే వ్యవస్థను రూపొందించి,తిరుమల తిరుపతి ఘాట్ రోడ్డును కూడా డిజైన్ చేసిన మహనీయుడు,మైసూర్ దివాన్గా ఏడు సంవత్సరాలు పనిచేసి,భద్రావతి ఉక్కు కర్మాగారం,మైసూర్ శాండల్ సబ్బుల ఫ్యాక్టరీ,అనేక కాలేజీలు, పాఠశాలలు స్థాపించి అభివృద్ధి పథంలో నడిపిన అపర భగీరథుడు అన్నారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ,చారగుళ్ళ గురుప్రసాద్,నారాయణమూర్తి,సుభాషిణి, రమేష్,డి.వి.సురేష్,నాగ వీరాబ్రహ్మచారి, దరియా సాహెబ్,గుద్దంటి రమేష్, పూర్ణా, రమేష్,దేవకి సుబ్బారావు, పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

- ఎస్సై ఖాదర్ బాషా

విశాలాంధ్ర - కారంచేడు : బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై కారంచేడు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.ఆదివారం రాత్రి గ్రామంలోని ప్రధాన కేంద్రాలు,రోడ్డు పక్కల ప్రాంతాలలో మద్యం సేవిస్తున్న కొంతమంది వ్యక్తులను గుర్తించి, పోలీస్ స్టేషన్కు తరలించారు. .పోలీస్ స్టేషన్లో వారికి కౌన్సిలింగ్ నిర్వహించిన పోలీసులు, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.ఈ తరహా చర్యల వల్ల తమ కుటుంబ ప్రతిష్ట దెబ్బతింటుందని,సమాజంలో తప్పుదారులు పడే అవకాశం ఉంటుందని వారికి వివరించారు.తదుపరి ఇలాంటి చర్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించడం ద్వారా మద్యం వ్యసనాన్ని మానుకోవాలని సూచించారు.

పశువులకు టీకాలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని గవినివారిపాలెం, బోయినవారిపాలెం,చీరాలనగర్, ఐక్య నగర్ గ్రామ పంచాయితీల పరిధిలో ఉన్న 565 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.చిట్టిబాబు తెలిపారు.జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కార్యక్రమంలో భాగంగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు.నాలుగు నెలల వయస్సు గల పశువుల నుండి అన్ని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామన్నారు. సిబ్బంది,పశు పోషకులు పాల్గొన్నారు.

చేతిపంపులు ఏర్పాటు

విశాలాంధ్ర - సంతమాగులూరు : బండివారి పాలెంలో చేతిపంపులకు మరమ్మతులు చేపట్టారు.ఆ గ్రామ మాజీ సర్పంచ్ పసుపులేటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ ఇంజినీరింగ్ సిబ్బందితో చేతిపంపులను బాగు చేయించారు.అలాగే ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మరో నాలుగు కొత్త బోర్లను వేయించి,వాటికి సామగ్రిని ఏర్పాటు చేశారు.సోమవారం వాటి పనితీరును పరిశీలించి,వాడుకలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పంచాయతీ వారికి,నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు భవిష్యత్తు కోసం ప్రణాళిక

విశాలాంధ్ర - అద్దంకి : విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగి భవిష్యత్తు కోసం స్పష్టమైన ప్రణాళికను ఏర్పరచుకోవాలని బాపట్ల జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ బొడ్డు వేణుగోపాలరావు సూచించారు. సోమవారం మండలంలోని నాగులపాడు అప్పర్ ప్రైమరీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వేణుగోపాలరావు విద్యార్థులకు భావోద్వేగ మేధస్సు, ఆత్మ విశ్వాసం,స్వీయ గౌరవం,లక్ష్యనిర్ధారణ,మానసిక ఆరోగ్యం పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.శంకర్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిఏలను వెంటనే విడుదల చేయాలి

విశాలాంధ్ర - అద్దంకి : ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ఉపాధ్యాయ సంఘం నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం అద్దంకి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ అద్దంకిమండల శాఖ ఆధ్వర్యంలో నిరసన వార్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని మెమో నెంబర్ 57ను తక్షణం అమలు చేయాలన్నారు. 12వ పిఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు.అన్ని రకాల బకాయిలను చెల్లించాలన్నారు.ఈ హెచ్ ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలన్నారు.యాప్‌లను అసెస్మెంట్ బుక్లెట్ విధానాలను రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు.

'బొల్లా'కు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-పామూరు : మండల టిడిపి అధ్యక్షులుగా నియమితులైన బొల్లా నరసింహారావు ను నర్ర మారెళ్ళ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు సోమవారం మహాలక్ష్మి మిల్క్ డైరీ లో మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ఎంపీపీ గుంటుపల్లి దశరథమయ్య ఆధ్వర్యంలో నరసింహారావు ను శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో గుంటుపల్లి సుబ్బారాయుడు, చిట్టెటి మాలకొండాయ్య, దగ్గుల రవీంద్ర రెడ్డి, గ్రామ టిడిపి అధ్యక్షులు నాగమల్లేశ్వరావు,ఈదల వెంకట రమణయ్య,పోక నాయుడు, పోక శంకర్, గంధం పప్పుదాస్,గంధం రాజరత్నం తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ న్యూ రైస్ కార్డులతో బియ్యం పంపిణీ

విశాలాంధ్ర - బాపట్ల : స్మార్ట్ న్యూ రైస్ కార్డులతో బియ్యం పంపిణీ జరుగునుందని ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్,డిఆర్ఓ జి.గంగాధర్ గౌడ్ తెలిపారు.స్మార్ట్ న్యూ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమం స్థానిక కలెక్టరేట్లో సోమవారం జరిగింది.ప్రభుత్వం నుంచి విడుదలైన స్మార్ట్ న్యూ రైస్ కార్డులను ప్రజల ఇంటి వద్దకే అందిస్తామని ఇంచార్జి సంయుక్త కలెక్టర్ చెప్పారు.జిల్లాలో 1,123 చౌక ధరల దుకాణాలు నడుస్తున్నాయన్నారు. వాటి పరిధిలో 4,71,382 రైస్ కార్డులు ఉన్నాయన్నారు.ఇక రైస్ కార్డులకు బదులుగా వాటి స్థానంలో స్మార్ట్ న్యూ రైస్ కార్డులను ప్రభుత్వం ఇస్తుందన్నారు. 15వ తేదీ నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించగా ఆమేరకు పంపిణీ ప్రక్రియను ప్రారంభించామన్నారు.జిల్లాకు 4.71 లక్షల స్మార్ట్ న్యూ రైస్ కార్డులు వచ్చాయన్నారు. సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికి వచ్చి అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తారన్నారు.అన్ని ప్రాంతాలలో కార్డుల పంపిణీ జరుగుతుందని,ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు ఎంపీడీవోలు పర్యవేక్షించాలని సూచించారు.వీటి వినియోగం కొరకు ఇ-పాస్ యంత్రాలను ఇప్పటికే జిల్లాకు విడుదల చేసిందన్నారు.ఎవరూ ఆందోళన చెందరాదని

ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ పి.గ్లోరియా,జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అమీర్ బాషా,డిఎల్‌డిఓ విజయమ్మ,సచివాలయాల కోఆర్డినేటర్ యశ్వంత్,ఉప కలెక్టర్ లవన్న,వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ,మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 15ను వరకు గాలికుంటు వ్యాధుల టీకాల కార్యక్రమం

గాలికుంటు వ్యాధుల టీకాల కార్యక్రమం ఈనెల 15 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని ఇంచార్జి సంయుక్త కలెక్టర్ గంగాధర్ గౌడ్ తెలిపారు.పశు వైద్యశాఖ రూపొందించిన గోడపత్రాలను సోమవారం ఆయన విడుదల చేశారు.అంటువ్యాధుల నుంచి పశు సంపదను కాపాడటం కోసం నూరు శాతం ఉచితంగానే టీకాలు వేస్తామన్నారు.జిల్లాలో 4.03 లక్షల గేదెలు,ఆవులు,ఎద్దులకు గాలికుంటు టీకాలు వేస్తున్నామన్నారు.పూర్తిస్థాయిలో టీకాలు వేసే కార్యక్రమానికి ప్రభుత్వమే శ్రీకారం చుట్టిందన్నా రు.ఈ అవకాశాన్ని పశు పోషకులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.పశువైద్యాధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్,ఆర్‌డిఓ పి.గ్లోరియా,ఉప కలెక్టర్ లవన్న, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : మనదేశంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో మహిళలు అవగాహన రాహిత్యంతో క్యాన్సర్ బారిన బడి చనిపోతున్నారని ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ సమత కడియాల అన్నారు.సోమవారం గుళ్ళపల్లి రామచంద్ర నర్సింగ్ హోమ్‌లో ఉచిత బ్రెస్ట్,గర్భాశయం ముఖద్వారానికి సంబంధించిన క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ సమత మాట్లాడుతూ బాల్య వివాహాలు, గర్భాశయ సమస్యలు,అబార్షన్లు, బ్రెస్ట్ సంబంధిత సమస్యలతో బాధపడేవారు క్యాన్సర్ టెస్ట్ చేయించుకోవడం ఎంతో మంచిది అన్నారు.ఈ పరీక్ష వల్ల వ్యాధి లక్షణాలు ముందుగానే తెలిసి ఆ జబ్బును నియంత్రించే అవ కాశం ఉంటుందన్నారు.ఈ పరీక్షల కోసం పట్ట ణాలకు వెళ్లి వేలకు వేల రూపాయలు చెల్లించాల్సిన అవసరం లేకుండా రామచంద్ర నర్సింగ్ హోమ్ వైద్యులు ప్రతి సంవత్సరము ఈ

శిబిరాన్ని నిర్వహిస్తున్నారన్నారు.దీనిలో దేశ విదేశాల నుండి వచ్చిన ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు పరీక్షల నిర్వహించి తగు సూచనలు అందిస్తారన్నారు. తొలుత ఈ వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య ప్రారంభించారు.డాక్టర్ కొడాలి వరప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి వైద్య బృందం ఘన నివాళులర్పించారు.ఈ శిబిరంలో అమెరికా నుండి వచ్చిన వైద్య బృందం సభ్యులు డాక్టర్ జాన్ టాల్ బెట్,కార్ల హౌబాకే, లూయి సార్,డాక్టర్ కొడాలి విజయలక్ష్మి,రమ్య తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ భవనానికి స్థలం కేటాయించండి

విశాలాంధ్ర-పొన్నలూరు : సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఆదేశాల మేరకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సొంత భవనము కట్టుకొనుటకు సోమవారం తహసీల్దార్ విపుల్లారావుకు వినతి పత్రం అందజేశారు. పొన్నలూరు సంఘం నందు 14 వేల పైచిలుకు మెంబర్లు, 12 కోట్ల రూపాయలు అవుట్ స్టాండింగ్ రుణాలు మంజూరు చేయడం జరిగిందని సంఘం సభ్యులు సామర్థ్యం సంఘానికి సొంత భవనం ఏర్పరచుటకు ప్రభుత్వ స్థలం 10 సెంట్లు కేటాయించవలసిందిగా కోరుచున్నామని చైర్పర్సన్ కొండలరావు వినతిపత్రం తాసిల్దారుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అనుమోలు సాంబ శివరావు, పల్లపోతు రమేష్ బాబు, దాసరి కృష్ణారావు, పల్లపోతు వెంకట్రావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ, రైతు సంఘ నాయకులకు సన్మానం

విశాలాంధ్ర-త్రిపురాంతకం : త్రిపురాంతకం టైలర్ అసోసియేషన్ సభ్యులు సీపీఐ నాయకులకు, రైతు సంఘం నాయకులను సత్కరించారు. ఈ కార్యక్రమం టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది.ఇటీవల కాలంలోని సీపీఐ రైతు సంఘం కమిటీల ఎన్నిక జరిగింది.అందులో భాగంగా డి శ్రీనివాస్ కు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులుగా, బాణాల రామయ్య ను ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నియోజకవర్గ కార్యదర్శిగా ఎన్ను కోవడం జరిగింది.అందుకుగాను టైలర్స్ అసోసియేషన్ నాయకులు వరికి అభినందనలు తెలిపి సాల్వా తో సత్కరించారు.ఈ కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ యూనియన్ అధ్యక్షుడు పిల్లి వెంకట్రావు, సెక్రటరీ శ్రీను, కోశాధికారి కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, దాదా, కరీముల్లా, శ్రీను, నాసర్ వలి, ఆంజనేయులు, మహేష్ పాల్గొన్నారు.

దావా సమను

ఒంగోలు 7వ అదనపు జిల్లా జడ్జీవారి కోర్టులో

OS NO 17/22

గోరంట్ల శారద మరియు ఇతరులు .... వాదులు

మరియు

సుప్పుల వెంకట రామారావు మరియు ఇతరులు .... ప్రతివాదులు

To

D7) గట్టుపల్లి వెంకటరావు, S/o. చిన్న గంగయ్య, R/O. అయ్యప్ప రాజుపాలెం మద్దిపాడు మండలం, ప్రకాశం జిల్లా,

D8) పెద్దినేని శ్రీలక్ష్మి, W/O. కోటేశ్వరరావు, పైడిపాడు, జరుగుమల్లి మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరున వాదులు మీపై దావా షెడ్యూల్ ఆస్తికి భాగా పంపిణీకి దావా దాఖలు చేసి మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీకు జారీ కానందున మీ నోటీసు నిమిత్తం తేదీ: **18.09.2025** కి వాయిదా వేసియున్నారు ఆ రోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గాని లేదా మీ లాయర్ ద్వారా కానీ పైకోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను లేనియెడల దావా మీ వరోక్షంగా తీర్మానించబడును తెలియజేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వులు మేరకు)

కరవది రాఘవరావు

వాదుల తరపు అడ్వకేట్, ఒంగోలు

బౌద్ధంలో స్త్రీ,పురుష సమానత్వం

- బౌద్ధ వక్తలు

విశాలాంధ్ర- ఒంగోలు : బౌద్ధ ధర్మ ప్రచార కేంద్రం ఆధ్వర్యంలో ఒంగోలు పట్టణంలో బౌద్ధ ధర్మ ప్రచార యాత్ర నిర్వహించారు. విశ్రాంత మాతా,శిశు సంక్షేమ శాఖ ఆర్. జె.డి ఉపాసక కరణం రాఘవరావు కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సుమారు 2600 సంవత్సరాల క్రితమే స్త్రీ, పురుష సమానత్వాన్ని, సర్వమానవ సమానత్వాన్ని గౌతమ బుద్ధుడు తన భిక్షు సంఘంలో అమలు చేశాడని, తదనంతరం బౌద్ధ అనుయాయులైన సామ్రాట్ అశోక చక్రవర్తి మరియు ఇతర రాజులు తమతమ రాజ్యాలలో స్వేచ్ఛ, సమానత్వం అమలు చేసి సుపరిపాలన అందించారని గుర్తు చేశారు. ఓ.పి. డి.ఆర్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపాసక చావలి సుధాకరరావు మాట్లాడుతూ బౌద్ధ మౌలిక సూత్రాలను కలిగి ఉన్న భారత రాజ్యాంగం సమున్నత మైనదని, పౌరులకు రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కులను పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. కుల, మత,రాజకీయాలకు అతీతంగా సుపరిపాలన జరగాలని రాజ్యాంగ నిర్మాత డా. అంబేద్కర్ ఆశించారని, కాని నేటి పాలకులకు ఆస్ఫూర్తి కొరవడిందని ఆయన అన్నారు. కందుకూరు ధర్మ చక్ర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉపాసక గాండ్ల హరిప్రసాదరావు బౌద్ధాభిమానులచే బుద్ధ వందనం, అంబేద్కర్ వందనం, త్రిశరణాలు, పంచశీలాలు చెప్పించారు. పాదయాత్ర రాజా పనగల్ రోడ్డు లోని అబ్దుల్ కలాం విగ్రహం వద్ద ప్రారంభమై కొణిజేడు బస్టాండ్, గద్దలగుంట మీదుగా మామిడిపాలెం అంబేద్కర్ విగ్రహం వద్ద ముగిసింది. ఈ కార్యక్రమంలో ఐ.ఎల్.పి నాయకులు దాసరి సుందరం, సి.పి.ఐ.ఎం.ఎల్ రెడ్ స్టార్ నాయకులు బి సుబ్బారావు, కె.ఎన్.పి ఎస్ నాయకులు జార్జి, విశ్రాంత ఆర్.ఐ ఎ.ఎల్. ప్రసాదు, ఎ.ఐ.బి.ఎస్.పి నాయకులు, బౌద్ధాభిమాని జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ ఆల్-న్యూ ఎల్ట్రా సిటీ ఎక్స్‌ట్రా విడుదల

విశాలాంధ్ర-ఒంగోలు: గ్రీవ్స్ కాటన్ లిమిటెడ్ ఇ-మొబిలిటీ విభాగం అయిన గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ (జీఈఎంఎల్), ఆల్-న్యూ గ్రీవ్స్ ఎల్ట్రా సిటీ ఎక్స్‌ట్రాను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇది ప్రసిద్ధ గ్రీవ్స్ ఎల్ట్రా సిటీ మెరుగైన వేరియంట్. అర్బన్ మొబిలిటీ అభివృద్ధి చెందుతున్న డిమాండ్లను తీర్చడానికి రూపొందించబడిన ఎల్ట్రా సిటీ ఎక్స్‌ట్రా "ఎవ్రీథింగ్ ఎక్స్‌ట్రా"ని అందిస్తుంది. అదనపు పరిధి, అదనపు భద్రత, అదనపు సాంకేతికత దీని ప్రత్యేకత. ఎల్ట్రా సిటీ ఎక్స్‌ట్రా పనితీరు, సాంకేతికత, నమ్మకం భద్రత యొక్క శక్తివంతమైన సమ్మేళనంతో రోజువారీ పట్టణ చలనశీలతను పెంచడానికి ప్రయత్నిస్తుంది. ఇది 170 కి.మీ నిజమైన రేంజ్, పవర్ మోడ్‌లో 60 కి.మీ గరిష్ట వేగం, నగర ప్రయాణాన్ని వేగవంతం, సున్నితంగా, మరింత సహజంగా మార్చే లక్ష్యంతో డిస్టెన్స్-టు-ఎంప్టీ (డీటీఈ), నావిగేషన్‌తో కూడిన 6.2" పీఎంవీఏ డిజిటల్ క్లస్టర్‌ను అందిస్తుంది. వాస్తవ ప్రపంచ పరిస్థితుల కోసం రూపొందించబడిన ఇది మెరుగైన గ్రౌండ్ క్లియరెన్స్, సౌకర్యం కోసం 12-అంగుళాల రేడియల్ ట్యూబ్‌లెస్ టైర్లను కలిగి ఉంది. దీని ధర 3,57,000 నుండి ప్రారంభమైంది.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

విశాలాంధ్ర -తాళ్లూరు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తూర్పుగంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక కోరారు. మండలంలోని లక్కవరం, బొద్దికూరపాడు , తూర్పుగంగవరం సచివాలయాల పరిధిలో ఆమె పరిశీలించారు. ఆయా గ్రామాలలో ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది వెళ్లి పరిశీలించి జ్వరాలు ఏవైనా ఉన్నట్లయితే తక్షణమే వైద్యశాలకు తరలించి పరీక్షల నిర్వహించి తగిన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఫ్రై డే డ్రై డే గా పాటించాలని చెప్పారు. పీహెచ్‌సీలో మలేరియా , టైఫాయిడ్ , డెంగ్యూ జ్వరాలకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తున్నట్లు తెలిపారు. ఎప్పుడు వైద్యం అవసరమైన పీహెచ్‌సిని సంప్రదించి అవసరమైన మందులు వాడుకోవాలని అన్ని మందులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఈఓ చంద్రశేఖర్ బాబు , హెచ్ ఎస్ గోపి నాయక్ , ఆరోగ్య , ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పీ-4 సర్వేకు పలువురికి శిక్షణ

విశాలాంధ్ర -తాళ్లూరు: ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించనున్న పీ-4 సర్వేకు ఇరువురు మాస్టర్ ట్రైనర్స్, పది మంది జీవస్ డబ్ల్యు ఎస్ సిబ్బంది హాజరు అవుతున్నట్లు ఎంపీడీఓ సానికొమ్ము సత్యం తెలిపారు. శిక్షణ పొందిన వారు ఈనెల 23న , 24న మండల పరిషత్ కార్యాలయంలో మిగిలిన సిబ్బంది కి శిక్షణ ఇవ్వనునట్లు తెలిపారు. ఒంగోలు వెళ్లవలసిన సిబ్బంది సకాలంలో శిక్షణకు హాజరు కావాలని కోరారు.

డిప్యూటీ ఎంపీడీవోగా షహనాజ్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర -తాళ్లూరు: డిప్యూటి ఎంపీడీఓగా షహనాజ్ బేగం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో సానికొమ్ము సత్యంను కలిసి ఆమె రిపోర్టు ఇచ్చారు. తాళ్లూరు, విఠలాపురం ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆమెకు అదనంగా డిప్యూటీ ఎంపీడీఓ బాధ్యతలు వచ్చాయి. ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ ఎంపీడీవో దార హనుమంతరావు మహిళా ఉద్యోగులతో అసభ్యకర చాటింగ్ ఆరోపణలతో పుల్లల చెరువు మండలానికి బదిలీపై వెళ్లారు.

పీ.ఎం.ఏ.యూ - 2 అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రధానమంత్రి ఆవాస్ యోజన - 2 (పీ.ఎం.ఏ.యూ - అర్బన్) పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన ' అవగాహన - 2025 ' పోస్టర్లను జాయింట్ కలెక్టర్ .ఆర్.గోపాలకృష్ణ సోమవారం గ్రీవెన్స్ హాలులో ఆవిష్కరించారు. ఈ పథకం కింద అర్హులైన వారు పొందేందుకు అవకాశం ఉన్న ప్రయోజనాల వివరాలను వారికి తెలియజేయడమే లక్ష్యంగా ఈ పోస్టర్లను రూపొందించినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ .బి.చిన ఓబులేసు, హౌసింగ్ పీ.డీ. శ్రీనివాస ప్రసాద్, టిట్కో డి.ఈ.ఈ. వీరబ్రహ్మాచారి, సిఎల్‌టిసి ఆనంద్, ఏ.ఈ.ఈ. మల్లికార్జునరావు, అధికారులు పాల్గొన్నారు.

పనిభారాన్ని తగ్గించండి

సచివాలయం ఉద్యోగులు

విశాలాంధ్ర - తర్లుపాడు : పని భారాన్ని తగ్గించి, ఒత్తిడి నుండి తమకు విముక్తి ప్రసాదించాలని తర్లుపాడు మండలంలోని అన్ని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బుర్రి చంద్రశేఖర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్బంగా సచివాలయాల సిబ్బంది మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే ప్రతి సర్వేలు, సంక్షేమ పథకాలు అందించే సేవలు సచివాలయ సిబ్బందిపై పని భారం పెంచుతున్నాయని,దీనివల్ల అధికారులు ఒత్తిడికి గురి అయ్యి అనారోగ్యం భారిన పడుతున్నారని,పని భారాన్ని తగ్గించాలని,వేతనము,రావాల్సిన ఇంక్రిమెంట్స్ పెంచాలని,ప్రమోషన్స్ కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తర్లుపాడు మండలంలోని సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. తర్లుపాడు మండలంలోని అన్ని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బుర్రి చంద్రశేఖర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్బంగా సచివాలయాల సిబ్బంది మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే ప్రతి సర్వేలు,సంక్షేమ పథకాలు అందించే సేవలు సచివాలయ సిబ్బందిపై పని భారం పెంచుతున్నాయని, దీనివల్ల అధికారులు ఒత్తిడికి గురి అయ్యి అనారోగ్యం భారిన పడుతున్నారని,పని భారాన్ని తగ్గించాలని,వేతనము,రావాల్సిన ఇంక్రిమెంట్స్ పెంచాలని,ప్రమోషన్స్ కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తర్లుపాడు మండలంలోని సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర -కారంచేడు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సామాజిక కార్యకర్తలు తమ పనులను చిత్తశుద్ధితో పూర్తి చెయ్యాలని డ్వామా పిడి విజయలక్ష్మి అన్నారు.. సోమవారం కారంచేడు మండలంలో సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి మాట్లాడుతూ కారంచెడు మండల అభివృద్ధి ప్రభుత్వం కేటాయించిన నిధులలో కొంత చిన్న చిన్న పొరపాట్లు మినహాయించి ఇబ్బందులేమి లేవన్నారు. ఉపాధి హామీ కూలీల అటెన్డెన్స్ అక్కడక్కడ పొరపాట్లు వున్నాయని వాటిని సరిచేసుకోవాలని కూలీ పనికి రాగానే అటెన్డెన్స్ వేసుకుంటే ఇబ్బందులు ఉండవన్నారు. ఉపాధి హామీ లబ్దిదారులు విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఉపాధి హామీ రికార్డులను పరిశీలించారు . ఈ కార్యక్రమంలో ఎపిడి సింగయ్య,కారంచేడు మండల అభివృద్ధి అధికారి తదితరులు పాల్గొన్నారు..

'పేస్' లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

విశాలాంధ్ర- ఒంగోలు : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో "జనరేటివ్ ఏఐలో తాజా ధోరణులు" అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ఫ్యూచర్ ఓవస్ కంపెనీ సహకారంతో ప్రొఫెసర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించబడింది. ఇందులో నిపుణులు జనరేటివ్ ఏఐ తాజా పరిణామాలు, పరిశోధనల్లో జరుగుతున్న అభివృద్ధులు, ప్రాక్టికల్ అప్లికేషన్లు పై విశదీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సతీష్ కర్రి (ట్రైడెన్స్ ఇన్క్.), బాలాజీ వుప్పులూరి (అమెరికన్ ఎక్స్‌ప్రెస్) ప్రధాన వక్తలుగా పాల్గొని, జనరేటివ్ ఏఐ ట్రెండ్స్, బోధనలో వినియోగం, పరిశ్రమలో అవకాశాలు గురించి చర్చించారు. ఈ సందర్బంగా కళాశాల సెక్రటరీ అంటే కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ ఆర్. వీరాంజనేయులు, డీన్ అకాడెమిక్స్ డాక్టర్ సి.వి. సుబ్బారావు ప్రసంగించి, ఇటువంటి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాములు అధ్యాపకులలో కొత్త సాంకేతిక పరిజ్ఞానం పై అవగాహన పెంపొందించడంలో ఎంతగానో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా ఏఐడీఎస్ విభాగాధిపతి డాక్టర్ జి. గణేష్ నాయుడు, కోఆర్డినేటర్‌గా శ్రీ కె. శివకృష్ణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక వర్గం మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

చెరుకుపల్లి జడ్పీ హైస్కూల్లో క్రీడా పోటీలు

విశాలాంధ్ర - చెరుకుపల్లి : క్రీడలు శారీరక దారుఢ్యానికి,మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాటూరు లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం స్థానిక హైస్కూల్లో మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు.ఈ పోటీలలో మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలుకు చెందిన 250 మంది విద్యార్థులు వివిధ పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు.సుమారు 25 మంది వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ పోటీలను నిర్వహించారు.కబడ్డీ,ఖోఖో,వాలీబాల్, బ్యాడ్మింటన్,యోగ,చదరంగం,అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించారు.గెలుపొందిన విద్యార్థులు డివిజన్ స్థాయిలో జరిగే ఆటల పోటీలలో పాల్గొంటారని తెలిపారు.మంగళవారం విద్యార్థినిలకు పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు పులిలాజర్,నవీన్ కుమార్,వ్యాయామ ఉపాధ్యాయుడు కాటూరి శ్రీనివాసరావు (చింతయ్య) వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్జీలు పరిష్కరిస్తాం

- జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్

విశాలాంధ్ర - బాపట్ల : అర్జీలు చట్టపరిధిలో విచారించి పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ అర్జీదారులకు భరోసా కల్పించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమం ద్వారా తమ సమస్యలను జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. భర్త/అత్తారింటి వేధింపులు,భూ వివాదాలు,ఆర్థిక లావాదేవీల మోసాలు తదితర పలు సమస్యలతో 54 మంది అర్జీదారులు పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమానికి విచ్చేశారు.ఎస్పీ వారితో ముఖాముఖీ మాట్లాడి, వారి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు.అర్జీలను విచారించి చట్ట పరిధిలో పరిష్కరిస్తామని వారికి భరోసానిచ్చారు. పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా చట్టపరంగా విచారించి పరిష్కరించాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు.అర్జీదారుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని అధికారులను హెచ్చరించారు.అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై నివేదికను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పీ పి.జగదీష్ నాయక్,పిజిఆర్ఎస్ సెల్ ఎస్సై ఏ.నాగేశ్వరరావు తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్జీటీలో సంధ్యారాణికి 12వ ర్యాంకు



విశాలాంధ్ర - సంతమాగులూరు : ఇటీవల విడుదలైన డీఎస్సీ 2025 ఫలితాల్లో ఏల్చూరుకు చెందిన ఇంటూరి సంధ్యారాణి ఎస్జీటీ టీచర్ పోస్టుకు ఎంపికయ్యారు.ఆమె ఎండిఎస్‌సి బదిరుల విభాగం (హియరింగ్ హ్యాండ్ క్యాప్డ్)లో రాష్ట్ర స్థాయిలో 12వ ర్యాంకు కైవసం చేసుకున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం ఐదు పోస్టులు ఉండగా,సంధ్యారాణి ఈడబ్ల్యూఎస్ క్వోటాలో క్వాలిఫై అయ్యారు.ప్రస్తుతం ఆమె నరసరావుపేటలోని ఎంఏఎం కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు.ఈసందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ తాను ఉపాధ్యాయ పోస్టుకు ఎంపిక కావడం పట్ల భర్త శింగంశెట్టి ఆంజనేయులు,ఇతర కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉందని చెప్పారు.రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ టీచర్ ఉద్యోగం సాధించిన ఆమెకు గ్రామస్థులు పలు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

అర్జీలను పరిష్కరించి ధృవీకరణ పత్రం ఇవ్వాలి

ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్ గంగాధర్ గౌడ్

విశాలాంధ్ర - బాపట్ల : పీజీఆర్ఎస్‌లో నమోదైన అర్జీలను పరిష్కరించిన తదుపరి సంబంధిత వ్యక్తులకు కచ్చితంగా ధృవీకరణ పత్రం ఇవ్వాలని ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్,డిఆర్ఓ జి.గంగాధర్ గౌడ్ తెలిపారు.పీజీఆర్ఎస్ కార్యక్రమం జిల్లా ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి.గంగాధర్ గౌడ్ అధ్యక్షతన సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను విన్నవించారు.తన పరిధిలోని వాటికి ఆయన అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపగా, కొన్నింటిని పరిశీలన, మరికొన్నింటిని విచారణకు ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 164 అర్జీలు నమోదయ్యాయి. పీజీఆర్ఎస్‌లో నమోదైన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ తెలిపారు.సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్త పాటించాలని తెలిపారు. స్వస్తి నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందన్నారు.ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు.అందులో భాగంగా అన్ని ప్రాంతాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సచివాలయాల స్థాయిలో వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు.ప్రజలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున కాచి వడపోసిన తాగునీరు మాత్రమే తీసుకోవాలన్నారు.డెంగ్యూ, టైఫాయిడ్,విష జ్వరాలు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్డిఓ పి.గ్లోరియా,ఉప కలెక్టర్ లవన్న, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసి నాగిరెడ్డి,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్.విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కూచినపూడి పీఏసీఎస్ అధ్యక్షులు డీవీఆర్

విశాలాంధ్ర - నిజాంపట్నం : రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని కూచినపూడి పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షులు దాసరి వెంకటేశ్వరరావు (డీవీఆర్) అన్నారు.సోమవారం కూచినపూడి పీఏసీఎస్ సొసైటీలో నిర్వహించిన యూరియా పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం పరితపించే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు.మంత్రి అనగాని సత్యప్రసాద్, టీడీపీ నేత అనగాని శివప్రసాద్‌ల చొరవతో నిజాంపట్నం,కూచినపూడి పీఏసీఎస్‌లకు అలాగే గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.మండల వ్యవసాయ అధికారి చుక్కా విజయరాజు మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత లేదని,రైతులకు సజావుగా యూరియా అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మండలంలో ఉన్న రెండు పీఏసీఎస్‌లకు,రైతు సేవా కేంద్రాలకు యూరియా దఫాలుగా వస్తుందని వచ్చిన యూరియా వచ్చినట్లుగా గ్రామాల్లో పీఏసీఎస్,వ్యవసాయ సిబ్బంది రైతులకు పంపిణీ చేస్తున్నారని చెప్పారు.యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.రైతులు తమ అవసరం మేరకు యూరియాను తీసుకువెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కేసన పమిడియ్య, కూచినపూడి టీడీపీ నాయకులు నల్లపాటి ఎల్లయ్య,ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు (యూత్),పీఏసీఎస్,వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

నానో యూరియాతో పంట ఉత్పాదకత పెంపు

ఏవో చుక్కా విజయరాజు

విశాలాంధ్ర - నిజాంపట్నం : నానో యూరియాతో పంటల ఉత్పాదకత పెరుగుతుందని మండల వ్యవసాయ అధికారి చుక్కా విజయరాజు అన్నారు.సోమవారం కూచినపూడి పీఏసీఎస్‌లో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) వారి సౌజన్యంతో నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ యూరియా వాడితే ఎక్కువ శాతం ఆవిరై నష్టం జరుగుతుందని అదే నానో యూరియా వాడితే 80 నుండి 90 శాతం వరకు మొక్కకు పడుతుందన్నారు.ఒక ఎకరానికి 500 మిల్లీ లీటర్ల పడుతుందని ఒక లీటర్ నీటిలో 2 నుండి 3 మిల్లీ లీటర్ల నానో యూరియాని కలిపి పిచికారి చేస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు.500 మిల్లీ మీటర్ల నానో యూరియా 45 కేజీల యూరియా బస్తాతో సమానంగా పని చేస్తుందన్నారు.రైతు సేవా కేంద్రాలలో నానో యూరియాను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు.ఉద్యాన సహాయకులు అశోక్ మాట్లాడుతూ ఆర్కేవీవై పథకం కింద కూరగాయల విత్తనాలు 50 శాతం రాయితీతో ఇస్తున్నట్లు తెలిపారు.దొండకాయ పందిళ్లు వేసి సాగు చేసే రైతులకు రూ.1 లక్ష వరకు రాయితీ లభిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో కూచినపూడి పీఏసీఎస్ అధ్యక్షులు దాసరి వెంకటేశ్వరరావు (డీవీఆర్),పీఏసీఎస్ డైరెక్టర్ కేసన పమిడియ్య,కూచినపూడి టీడీపీ నాయకులు నల్లపాటి ఎల్లయ్య, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు (యూత్),పీఏసీఎస్,వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఏజీపీకి అభినందనలు

విశాలాంధ్ర - జె.పంగులూరు : అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నూతనంగా ఎంపిక అయిన ప్రముఖ బిసి లాయర్ బత్తుల రామకోటయ్యకు పంగులూరు మండల నాయకులు ఓబుల్ రెడ్డి,గుర్రం శేఖర్ సోమవారం అద్దంకిలోని ఏజిపి నివాసంలో కలిసి దుశ్శాలువ పూలమాల బొకేతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.బిసి సామాజిక వర్గానికి చెందిన రామకోటయ్యను ఏజీపీగా నియమించడం కూటమి ప్రభుత్వంకు బీసీల పట్ల ఉన్న అభిమానాన్ని చాటిందని ఇందుకు సహకరించిన అద్దంకి నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర విద్యుత్ శాఖ మాత్యులు గొట్టిపాటి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ బత్తుల రామకోటయ్య సీనియర్ లాయర్‌గా న్యాయ సలహా మండలి అధ్యక్షుడిగా టిడిపి లీగల్ సెల్ అధ్యక్షుడిగా పనిచేసి లాయర్ వృత్తిలో ఎంతోమంది పేదలకు ఫీజు లేకుండా అలాగే తక్కువ ఫీజులతో కేసులు వాదించి అందరి చేత మంచి లాయర్‌గా పేరు తెచ్చుకున్న అనుభవజ్ఞులు ఇలాంటి వారికి ఏజీపీ పదవి ఇవ్వడం ఆ పదవికే వన్నెతెచ్చినట్లు అయిందని ఇలాంటి వారిని ప్రోత్సహించటం మంచి పరిణామం అని రామకోటయ్య భవిష్యత్తులో ఇంకా ఉన్నత పదవులను అలంకరించాలని కోరుకుంటున్నామన్నారు.

18 నుంచి క్రీడా పోటీలు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండల స్థాయిలో నిర్వహించే స్కూల్ గేమ్స్ పోటీలు మరియు ఎంపికలను ఉప్పుగుండూరు జిల్లా పరిషత్ హైస్కూల్ లోఈ నెల 18వ తేదీ న నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారులు రవి, రమణయ్యలు తెలిపారు. సోమవారం సమావేశం నిర్వహించారు, మండలంలోని అన్ని యాజమాన్యం పరిధిలోని పాఠశాలలు, గుర్తింపు పొందిన అన్ని పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనుటకు అర్హులని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్,బాడ్మింటన్, చెస్,యోగా,అథ్లెటిక్స్, తదితర క్రీడలు 14,17 సంవత్సరాల వయస్సులోపు బాల బాలికలకు ఈ పోటీలు 18వ తేది ఉదయం 10గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. మండల కోఆర్డినేటర్ యన్ కృష్ణ , పీడీలు పాల్గొన్నారు.